


**ఇఫ్తార్ విందు**

**మండలంలోని** దుర్కి గ్రామంలో ముస్లింలు శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు ముందుస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
-నస్రుల్లాబాద్, ఏప్రిల్ 5



## రైతుకు మద్దతుగా.. నేడు ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ దీక్షలు




కామారెడ్డి/బాన్సువాడ/వేల్పూర్, ఏప్రిల్ 5: కష్ట కాలంలో రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నది. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పాటు వడగండ్లు, అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్నది. వడ్లకు రూ.500 బోనస్, నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు నేడు (శనివారం) రైతు దీక్షలు నిర్వహించనున్నది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం 10.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో రైతుకు మద్దతుగా దీక్ష చేపడుతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ శుక్రవారం తెలిపారు. బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రైతుదీక్ష ప్రారంభిస్తామని బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి తెలిపారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు మద్దతు దీక్ష చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు రేగుల్ల రాములు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షలను విజయవంతం చేయాలని వారు కోరారు.



జలకళ లేక మైదానంగా మారిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

# ఎండుతున్న ఎస్సారెస్పీ

- ఐదారు జిల్లాలకు శ్రీరాంసాగరే పెద్దదిక్కు
- డెడ్‌స్టోరేజీకి చేరువవుతున్న ప్రాజెక్టు
- 12 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ
- మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కష్టమే
- వేసవి ప్రణాళిక రూపకల్పనలో సర్కారు వైఫల్యం
- పొంచి ఉన్న తాగునీటి గండం.. గొంతెండుడు ఖాయం

**రానున్న రోజుల్లో తాగునీటికీ కటకటే..**

**లక్షలాది** కుటుంబాలకు ఆయువుపట్టు అయిన శ్రీరాంసాగర్‌లో నీరు అడుగంటుతున్నది. ప్రాజెక్టులో నిల్వ ఉన్న జలధార వేగంగా ఆవిరవుతున్నది. మండుటెండలు దంచి కొడుతున్న తరుణంలో మున్ముందు తాగునీటిగండం తలెత్తే ప్రమాదం పొంచి ఉన్నది. ఐదారు జిల్లాలకు తాగునీరందించే ప్రాజెక్టు ఎండి పోతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పుడే ఇలా ఉంటే మే, జూన్ మాసాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా ఎలా అన్న ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తున్నది.

నిజామాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కాంగ్రెస్ సర్కారుకు ముందుచూపు లేకపోవడం, వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో విఫలం కావడంతో లక్షలాది ఆవాసాలకు క'న్నీటి' కష్టాలు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించని పాలకులు.. ప్రాజెక్టు నుంచి ఎడాపెడా దిగువకు నీటిని విడుదల చేశారు. ఫలితంగా ఎస్సారెస్పీ ఇప్పుడు డెడ్‌స్టోరేజీకి చేరువవుతున్నది. శ్రీరాంసాగర్ నీటిమట్టం ప్రస్తుతం 12 టీఎంసీలకు పడిపోయింది. ప్రభుత్వ ప్రణాళికాలోపం వల్ల ఇప్పటికే లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోగా, ఇప్పుడు తాగునీటికీ తండ్లాడే పరిస్థితి తలెత్తింది.

**నిరుడు నిండుగా.. ఇప్పుడేమో ఖాళీగా..**

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే ప్రధాన జలాశయంలో నీటి నిల్వలు అడుగడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఐదారు జిల్లాల తాగునీటికి ఆధారమైన ఎస్సారెస్పీ నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం మూలంగా ఇప్పుడు తాగునీటి గండం పొంచి ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1059.10 అడుగుల (12.06 టీఎంసీలు) మేర నీరు ఉంది. గతేడాది ఇదే సమయానికి 30 టీఎంసీలు ఉండగా, కాంగ్రెస్ సర్కారు చేష్టల వల్ల ప్రస్తుతం 12 టీఎంసీలు మాత్రమే నీరు మిగిలింది. ఫలితంగా మండుటెండల్లో తలెత్తే నీటి గండం కళ్లముందు కనిపిస్తున్నది. ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ ద్వారా ఇష్టారీతిన నీళ్లను దిగువకు పంపడం మూలంగా తాగునీటికి ఇక్కట్లు తప్పేలా లేవు. నెలల వ్యవధిలోనే ఏకంగా 67 టీఎంసీలను కిందకు తరలించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మండుటెండల్లోనూ వరద కాలువ ద్వారా ఇన్‌ఫ్లో రావడంతో శ్రీరాంసాగర్ నిండుకుండలా మారింది. ఫలితంగా తాగు, సాగు నీటికి కొరత లేకుండా పోయింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాగు, సాగునీటికి కటకట ఏర్పడిందని ప్రజలు, రైతులు వాపోతున్నారు.

**తాగునీటికి తండ్లాటే..**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆధారంగా నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు మిషన్ భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నారు. రోజుకు 231 క్యూసెక్కుల నీటిని ఇందుకు వినియోగిస్తున్నారు. కోరుట్ల – జగిత్యాల సెగ్మెంట్‌కు 61 క్యూసెక్కులు, ఆదిలాబాద్ – నిర్మల్ సెగ్మెంట్‌కు 63, ఆర్మూర్ – నిజామాబాద్ – కామారెడ్డికి 107 క్యూసెక్కుల చొప్పున వదలాల్సి ఉంది. ఎండలు దంచి కొడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి ఇక్కట్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముందుచూపు లేని కాంగ్రెస్ ఇష్టారీతిన 61 టీఎంసీలను దిగువకు పంపించి, ఇప్పుడు చేష్టాలుడిగి చూస్తున్నది.

**67 టీఎంసీలు తోడేశారు..**

కేసీఆర్ హయాంలో మండుటెండల్లోనూ నిండుకుండలా కనిపించిన ఎస్సారెస్పీ ప్రస్తుతం కళావిహీనంగా మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన పది రోజులకు డిసెంబర్ 17న ఎస్సారెస్పీలో 78.342 టీఎంసీలు (1088.60 అడుగులు) నీరు నిల్వ ఉంది. వేసవిని దృష్టిలో పెట్టుకోకుండా ఎస్సారెస్పీ నీటిని ఎడాపెడా దిగువకు వదలడంతో ప్రాజెక్టు అడుగంటింది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత నీటి విడుదలలో పారదర్శకత లోపించింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఫోన్‌లు చేస్తే ఇష్టానుసారంగా నీళ్లను దిగువకు వదిలేశారు. ఆవాసాలకు తాగునీరందించాలన్న బాధ్యతను విస్మరించి. డిసెంబర్ 17 నుంచి ఏప్రిల్ 5 వరకు 67 టీఎంసీలు తరలించారు. సరైన వ్యూహం లేకపోవడం, ఇష్టానుసారంగా దిగువకు సాగునీరు పేరుతో విచ్చలవిడిగా వదలడంతో నీటి ఎద్దడి తప్పేలా లేదు. శ్రీరాంసాగర్‌లో నీటిమట్టం తగ్గుతుండటంతో ప్రాజెక్టు లోపలి భాగం బయటికి తేలిపోయి కళావిహీనంగా దర్శనం ఇస్తోంది. సగానికి ఎక్కువ ప్రాంతమంతా మైదానాన్ని తలపిస్తున్నది. బ్యాక్ వాటర్ ఏరియాలో కృష్ణ జింకల సవ్వడి తగ్గిపోతుండగా వేటగాళ్ల ఉచ్చులోనూ భారీగా మూగ జీవాలు బలి అవుతున్నాయి. ఎస్సారెస్పీ డెడ్ స్టోరేజీ 7 టీఎంసీలు కాగా, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలను ఏ విధంగా తీరుస్తారో సర్కారుకే తెలియాలి.



ప్రస్తుతం నీటి మట్టం




హెగ్డోలిలో నిరసన తెలుపుతున్న రైతులు

# 'పొద్దు' కొనుగోళ్లపై మొద్దు నిద్ర!

**కేంద్రాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం**

- పొద్దుతిరుగుడు పంట కొనుగోలు చేయాలని డిమాండ్
- కోటగిరి మండలం హెగ్డోలిలో రైతుల ఆందోళన

కోటగిరి, ఏప్రిల్ 5: రాష్ట్ర ప్రభుత్వం పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేయాలని హెగ్డోలి, కొల్లూర్, యాద్గార్‌పూర్ గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ కొనుగోలు చేయని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం వారు మండలంలోని హెగ్డోలి సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి కోటగిరి మండలంలో సుమారు 15 వందల నుంచి రెండు వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంటను సాగు చేశామని తెలిపారు. దాదాపు 20 వేల క్వింటాళ్ల వరకు పంట పండినట్లు చెప్పారు. హెగ్డోలిలో మార్చి 15న మార్క్‌ఫెడ్ ద్వారా పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి, కేంద్ర ప్రభుత్వ అనుమతి మేరకు 1400 క్వింటాళ్లు కొనుగోలు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఇంకా రాకపోవడంతో కొనుగోళ్లను పది రోజుల క్రితమే మూసివేశారని వాపోయారు. గోనె సంచుల కొరత కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పొద్దు తిరుగుడు పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం వరకు కొనుగోలు చేయకుంటే మంగళవారం పొతంగల్ చెక్‌పోస్టు వద్ద ఆందోళన చేస్తామని రైతులు స్పష్టం చేశారు.

### గోనె సంచుల్లేవ్..



పంటను అమ్మడానికి కొనుగోలు కేంద్రానికి వస్తే ఇక్కడ గన్నీ బ్యాగులు లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి రాలేదని చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంటను కొనుగోలు చేయాలి. వర్షాలు కురిస్తే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**- గంగారాం,రైతు హెగ్డోలి, పొతంగల్ మండల**

### తొమ్మిది ఎకరాల్లో పంట పండించిన..



యాద్గార్‌పూర్‌లో తొమ్మిది ఎకరాల్లో సన్‌ఫ్లవర్ పంటను పండించిన. ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని హెగ్డోలి కొనుగోలు కేంద్రంలో మా పంటను కొనుగోలు చేయడం లేదు. అక్కడ కాంటాను నిలిపి వేయడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

**-షేక్ హైమద్, రైతు, యాద్గార్‌పూర్**

### వెంటనే కొనుగోలు చేయాలి..



రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హెగ్డోలిలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలుకు వెంటనే అనుమతి ఇవ్వాలి. కొనుగోలు కేంద్రం మూసివేసి పది రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి స్పందనలేదు. గన్నీ బ్యాగులు కూడా లేవు. చివరకు కుప్పలు పోసి 15 రోజులు గడుస్తున్నా అలాగే ఉన్నాయి.

**- రాజు, రైతు హెగ్డోలి, పొతంగల్ మండలం**

### రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్మిషన్ రాలేదని..



ప్రభుత్వం నుంచి ఇంకా తమకు ఎలాంటి అనుమతి రాలేదని పది రోజుల క్రితమే కొనుగోళ్లను నిలిపివేశారు. 211 మంది రైతులు ఉంటే కేవలం 39 మంది రైతుల నుంచి1400 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసి కేంద్రాన్ని మూసేశారు. మిగతా రైతులు ఎక్కడికి పోవాలి. నేను 15 ఎకరాల్లో పంటను పండించిన. **- విశ్వనాథ్, రైతు హెగ్డోలి, పొతంగల్ మండలం**

# కబుర్లు మాని హామీలు నెరవేర్చాలి

- ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన రేవంత్ సర్కార్
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- పాలిటెక్నిక్ మైదానంలో వాకర్స్‌తో సమావేశం

సారంగాపూర్, ఏప్రిల్ 5: అబద్ధాలు, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ..సొల్లు కబుర్లు మాని ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. ప్రజలు, రైతుల సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విస్మరించి, కక్ష రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అర్బన్, రూరల్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఉదయం వాకర్లతో సమావేశమయ్యారు. ఆప్యాయంగా పలుకరించి తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం బాజిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను తీర్చాల్సిన బాధ్యతను మరిచి సీఎంతోపాటు మంత్రులు సోయి లేకుండా స్కాంలు జరిగాయంటూ నిరాధారమైన ఆరోపణలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పార్లమెంట్ పరిధిలో ఉన్న నిజామాబాద్ జిల్లాను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మళ్లీ ఎంపీ అభ్యర్థిగా ఓట్లు ఏ ముఖం పెట్టుకుని అడుగుతాడని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఇప్పటికే విసుగు చెంది ఉన్నారని, ఈసారి ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో ఆత్మీయంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

**పేపర్లు చూపిస్తూ ఓట్లడుగుతున్న అర్వింద్..**

అబద్ధాల అర్వింద్ ఎంపీగా ఉండి జిల్లాకు ఆయన చేసింది శూన్యమన్నారు. ఆయనపై ఏడు సెగ్మెంట్ల ప్రజలు గుర్రుగా ఉన్నారన్నారు. ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి పసుపు రైతులను మోసం చేశాడని మండిపడ్డారు. అప్పుడేమో బాండ్ పేపర్ చూపించి ఓట్లు దండుకున్న అర్వింద్ మళ్లీ ఇప్పుడు ఇటీవల ఏదో జీవో కాపీ తీసుకువచ్చి ఎంపీగా గెలిపించాలని ఓట్లు అడగడం ఎంతవరకు సమంజసమన్నారు. అప్పుడు, ఇప్పుడు పేపర్లు చూపిస్తూ ఓట్లు అడిగే అర్వింద్‌ను ప్రజలు, రైతులు ప్రస్తుతం నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. అర్వింద్‌ను ఆపార్టీ క్యాడర్‌తో పాటు ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. షుగర్ ఫ్యాక్టరీలు తెరిపిస్తామంటూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పేవన్నీ ఉత్తుత్తి మాటలేనని పేర్కొన్నారు. పసుపు బోర్డు కోసం నాడు అప్పటి ఎంపీ కవిత ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు.

**కొట్లాడి సమస్యలు పరిష్కరిస్తా ..**

తనకు ఒక్కసారి ఎంపీగా అవకాశమివ్వాలని, తమ పార్టీ అధికారంలో లేకున్నా అపోజిషన్‌లో ఉండైనా కొట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాజిరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ సింగిల్ లైన్ రైల్వే ట్రాక్‌ను డబ్లింగ్ చేసేందుకు కృషి చేస్తానన్నారు. దశాబ్దాల కల అయిన బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేసేందుకు పాటుపడుతానన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వేలాది మంది యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నందున వారి సంక్షేమం కోసం తాను ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. బాజిరెడ్డి వెంట నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, దాసరి లక్ష్మీనర్సయ్య, ఉమాపతిరావు, కొర్వ దేవేందర్, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

## బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నిజామాబాద్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అధికారులు, నాయకులు

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు.



కామారెడ్డి కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, అధికారులు